# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **రాష్ట్ర శాసన సభ సమావేశాల్లో నూతనంగా ఎన్నికైన శాసన సభ్యులు ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు.**

**2.** **అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.**

**3.** **యోగా భారతీయ సంస్కృతిలో భాగమని కేంద్ర ఉక్కు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.**

**4.** **అమరావతికి కొత్త రైల్వే లైన్ మార్గం కోసం భూసేకరణ చేసేందుకు అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.**

**5.** **రాష్ట్రంలో అటవీ సంపద పరిరక్షణ కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.**

**===========================**

ఆంధ్రప్రదేశ్ 16 వ శాసన సభ సమావేశాలు ఈ రోజు ప్రారంభమయ్యాయి. ప్రోటెం శాసనసభాపతిగా ఎన్నికైన రాజమహేంద్రవరం గ్రామీణ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఈ రోజు అధికార, ప్రతిపక్ష సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత ముఖ్యమంత్రి హోదాలో తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు శాసన సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు.

వాయిస్ ..27 సెకన్లు

ఆ తరువాత ఉప ముఖ్య మంత్రి, జన సేన పార్టీ అధ్యక్షులు కె. పవన్ కళ్యాణ్ శాసన సభ్యునిగా ప్రమాణం చేశారు.

వాయిస్ .. 25 సెకన్లు

అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి శాసన సభ్యునిగా ప్రమాణం చేశారు.

వాయిస్ ..22 సెకన్లు

అనంతరం అక్షరక్రమంలో శాసన సభ్యులతో ప్రోటెం శాసనసభాపతి ప్రమాణ స్వీకారం చేయిస్తున్నారు. కాగా సభ్యుల ప్రమాణ స్వీకారం పూర్తయిన అనంతరం సభాపతి ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడుతుంది. రేపు సభాపతి, ఉప సభాపతి ఎన్నిక జరుగుతుంది. సభాపతి ఎన్నిక ప్రక్రియ ముగిసిన అనంతరం శాసన సభ వాయిదా పడుతుంది.

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విజయవాడలోని రైల్వే డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన యోగా దినోత్సవంలో రైల్వే డివిజనల్ మేనేజర్ నరేంద్ర పాటిల్ పాల్గొని.. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని కోరారు. శ్రీకాకుళం జిల్లాలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా దినోత్సవంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు పాల్గొని మాట్లాడుతూ... నేటి ఒత్తిడి జీవన విధానానికి యోగా చక్కని పరిష్కారమని, యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు.

ఒంగోలులోని జిల్లా కారాగారంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగాభ్యాసం ఖైదీల్లో పరివర్తనకు దోహదం చేస్తుందని తెలిపారు.

యోగాభ్యాసనం వల్ల మానసిక రుగ్మతల నుంచి ఉపశమనం కలుగుతుందని ఆయుర్వేద పరిశోధన సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. విజయవాడలో నిర్వహించిన యోగా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు.

---------------------------

సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందేందుకు యోగా ఉపకరిస్తుందని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. అమలాపురంలో నిర్వహించిన యోగా దినోత్సవ వేడుకలో కలెక్టర్ పాల్గొన్నారు.

యోగా సాధన భారత సంస్కృతిలో ఒక భాగమని పార్వతీపురం మన్యం జిల్లా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ తెలిపారు. గుంటూరులోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన యోగా దినోత్సవంలో గుంటూరు పశ్చిమ శాసన సభ్యురాలు జి.మాధవి పాల్గొని.. మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చొరవతో యోగాకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు లభించిందని తెలిపారు. యోగా సాధన ద్వారా శారీరక బలంతో పాటు మానసిక బలం కూడా పెరుగుతుందని అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పేర్కొన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా యోగాభ్యాసంలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు కలెక్టర్ సర్టిఫికెట్లను అందజేశారు.

యోగా దినోత్సవాన్ని విజయనగరం జిల్లాలోని స్థానిక క్రీడా మైదానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ కె.కార్తీక్ పాల్గొని యోగా ఆవశ్యకత గురించి వివరించారు.

---------------------------

యోగా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందడానికి ఉపకరిస్తుందని, యోగా భారతీయ సంస్కృతిలో భాగమని కేంద్ర ఉక్కు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మానసిక ప్రశాంతత కోసం ప్రపంచ వ్యాప్తంగా నేడు యోగ

సాధన చేస్తున్నారని తెలుపుతూ...

వాయిస్ ....24 సెకన్లు

---------------------------

అమరావతికి కొత్త రైల్వే మార్గం నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం తాజాగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణలోని ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి ఎన్టీఆర్ జిల్లా మీదుగా వయా అమరావతి, గుంటూరు జిల్లా నంబూరు వరకు 56.53 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్ ప్రాజెక్ట్ కోసం భూసేకరణ చేసేందుకు అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వెంటనే ఆయా ప్రాంతాల్లో భూసేకరణ చేసేందుకు రైల్వే శాఖకు అనుమతి ఇస్తూ ఆదేశాలు ఇచ్చింది.

---------------------------

రాష్ట్రంలో అటవీ సంపద పరిరక్షణ కోసం ప్రత్యేక ప్రణాళికలు  సిద్ధం చేయాలని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో  నిన్న రాష్ట్ర అటవీ, గ్రామీణాభివృద్ధి, సాంకేతిక శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ,  మడ అడవుల పరిరక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలని, వాటిని ధ్వంసం చేసే వారెవరినీ ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేలా సైన్స్‌పై ఆసక్తి పెంచే కార్యక్రమాలు విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. ఉపాధి హామీ నిధులు దుర్వినియోగం కాకుండా పనులను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకాన్ని మరింత విస్తృతంగా గ్రామీణ అభివృద్ధి కోసం వినియోగించుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు.

---------------------------

తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే శ్రీవారి మెట్టు మార్గంలో దివ్యదర్శనం టోకెన్ల స్కానింగ్‌ను పునఃప్రారంభించినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం–టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది.  మెట్టు మార్గంలో టోకెన్ల స్కానింగ్ ట్రయల్ రన్ ను నిన్న చేపట్టినట్లు టీటీడీ తెలిపింది. శ్రీవారి మెట్టు వద్ద దివ్యదర్శనం టోకెన్లు తీసుకున్న భక్తులు ఈరోజు  నుంచి విధిగా 1,200వ మెట్టు వద్ద స్కానింగ్ చేయించుకోవాల్సి ఉంటుందని, లేకుంటే నిర్దేశిత టైమ్‌స్లాట్‌తో దివ్యదర్శన క్యూలైన్లలోకి అనుమతించరని స్పష్టం చేసింది. ఈ మార్పునకు అనుగుణంగా భక్తులు దర్శన ఏర్పాట్లు చేసుకోవాలని  టీటీడీ సూచించింది.

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఈరోజు విశాఖపట్నంలోని బీచ్ రోడ్‌లో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు ఎమ్. శ్రీభరత్, పిఐబి & సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ రాజేందర్ చౌదరిలతో పాటు పలువురు సమాచార శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యులు శ్రీభరత్ మాట్లాడుతూ.. పాశ్చాత్య దేశాల్లో యోగాకు ఆదరణ పెరుగుతోందని తెలిపారు. యోగాతో ఆరోగ్య సమస్యలను ఎదుర్కొవచ్చని తెలుపుతూ...

..వాయిస్...25 సెకన్లు

---------------------------

ప్రతిరోజు యోగా సాధన ద్వారా శారీరక బలంతో పాటు మానసిక బలం కూడా పెంపొందుతుందని రాష్ట్ర గనులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో పోలీస్ మైదానంలో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, యోగాసన ప్రక్రియ ప్రతి రోజు చేయడం ద్వారా శరీరంలో నిస్తేజమైన శక్తిని మేల్కొల్పడానికి ఉపయోగపడి శారీరక మానసిక దృఢత్వాన్ని అందిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో యోగాను భాగం చేసుకోవాలని మంత్రి పేర్కొన్నారు.

-------------------------

టమాటా ధరలు అధికంగా ఉన్న నేపథ్యంలో వినియోగదారులకు రైతు బజార్ల ద్వారా అందించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. నిన్న విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. మార్కెట్లో టమాటా, ఉల్లిపాయలు, ఇతర కూరగాయల లభ్యతతో పాటు వాటి ధరలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, టమాటా ధరలు అధికంగా ఉన్న నేపథ్యంలో రైతు బజార్ల ద్వారా అందించేందుకు మార్కెటింగ్ శాఖ చర్యలు చేపట్టిందన్నారు.

-------------------------

నైరుతి రుతుపవనాలు రాష్ట్రం అంతటా విస్తరించాయని కర్ణాటక, కేరళ తీరాల మీదుగా ద్రోణి కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజులపాటు పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామ రాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

======================